క్లుప్తంగా

క్షయ వ్యాధిపై అవగాహన



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో క్షయవ్యాధిపై అవగాహనా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈఓపీఆర్డీ పి.శ్రీనివాసరావు, తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పి.రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని, శరీరం బరువు తగ్గడం, చెమటలు పట్టడం, తరచు జ్వరం రావడం ఈ వ్యాధి లక్షణాలని అన్నారు. క్షయ వ్యాధి లేని గ్రామంగా చిలువూరును ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరి కె.లక్ష్మి, గ్రామ సర్పంచి సిహెచ్.మాణిక్యం, ఏఎన్ఎంలు ఎస్.వాణి, ఎస్‌కే ఆషా, ఎంఎల్‌హెచ్‌పిలు పి.స్రవంతి, పి.సుధ పాల్గొన్నారు.

ఓటు హక్కును ప్రజలు వినియోగించుకోవాలి



ఫిరంగిపురం: మండలంలోని మునగపాడు, బేతపూడి గ్రామాల్లో బుధవారం ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. నియోజకవర్గ నోడల్ అధికారి సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్నికల సమయంలో వినియోగించుకోవాలన్నారు. ఈవీఎంల పనితీరు, ఓటు వేసే విధానం, వీవీ ప్యాట్స్ వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాన్‌సైదా, వీఆర్వో పుల్లారావు, పంచాయతీ కార్యదర్శి విష్ణువర్ధన్‌రావు పాల్గొన్నారు.

విజ్ఞానంతో కూడిన విద్య అవసరం



ఫిరంగిపురం: విజ్ఞానంతో కూడిన విద్య విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందని సిస్టర్ నిర్మలామేరి అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్‌ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయురాలు సయ్యద్ షాకీరా రాసిన నా మొదటి విజ్ఞాన శాస్త్ర పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. నిర్మలామేరి మాట్లాడుతూ పుస్తకంలోని పలు అంశాలు మూడు నుంచి ఆరో తరగతి విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు దోహదం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎలిజిబెత్‌రాణి, అనిల్‌కుమార్, విక్టోరియారాణి, కల్యాణి, అనసూయ, విజయరాణి, అనిత, సుజాత పాల్గొన్నారు.

బ్యారేజ్ వద్ద పోలీసులు తనిఖీ



తాడేపల్లిరూరల్: మద్యం తాగి అర్ధరాత్రులు తిరిగితే సహించేది లేదని తాడేపల్లి సీఐ మధుసూదనరావు హెచ్చరించారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద సీఐ మధుసూదనరావు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి 12 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ తనిఖీ సమయంలో చాలా మంది విద్యార్థులు, యువతీ యువకులు ఎటువంటి పనులు లేకుండా అర్ధరాత్రి సమయంలో రోడ్లపై తిరగడాన్ని గమ నించినట్లు చెప్పారు. కౌన్సిలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కొంతమంది పోలీస్, ప్రెస్ అని స్టిక్కర్లు వేసుకుని తిరుగున్నారని, మొదటిసారి తప్పుగా ఆ స్టిక్కర్లు తొలగించి హెచ్చరించి పంపిస్తున్నామని, సంబంధిత శాఖల్లో పనిచేయకుండా అలాంటి స్టిక్కర్లు వేసుకుంటే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

తక్షణమే తాగునీటి బోరు ఏర్పాటు

మంగళగిరి: స్థానిక ప్రజలు అడిగిన వెంటనే తాగునీటి బోరు వేయించారు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే). వివరాలు.. మంగళగిరి-తాడేపల్లి కార్పోరేషన్ పరిధి ఆత్మకూరు శ్రీనివాసకాలనీలో కమ్యూనిటీ స్థలాలకు సంబంధించి రూ.60 లక్షలతో నిర్మించిన ప్రహరీ ప్రారంభోత్సవానికి బుధవారం ఎమ్మెల్యే ఆర్కే హాజరయ్యారు. అదే సందర్భంలో స్థానికులు తాము తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని కమ్యూనిటీ స్థలంలో బోరు వేయించాలని ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన నగరపాలక సంస్థ అధికారులతో, కాంట్రాక్టర్‌తో మాట్లాడి నిమిషాల వ్యవధిలోనే బోరు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

పేదల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయం

ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



కాజ పుల్లయ్యనగర్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, గంజి చిరంజీవి తదితరులు

మంగళగిరి: పేదల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) పేర్కొన్నారు. మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కాజ, నిడమర్రు, ఆత్మకూరు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. తొలుత కాజ పుల్లయ్యనగర్‌లో సుమారు రూ.3.20 కోట్లతో నిర్మించిన పది సిమెంట్ రోడ్లు, మూడు సీసీ డ్రైనేజ్ నిర్మాణాలను ఎమ్మెల్యే ఆర్కే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, స్థానిక ప్రజలతో రిబ్బన్ కట్ చేయించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ కార్పోరేషన్ పరిధిలోని కాజ పుల్లయ్యనగర్ వాసులకు సరియైన రహదారులు లేకపోవడంతో ప్రతి ఏడాది వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టికి రావడంతో సమారు రూ.3.20 కోట్లతో పలు సిమెంటు రోడ్లు, సిమెంటు డ్రైనేజ్‌లను నిర్మించడం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేసి సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవితో కలసి ఆత్మకూరు శ్రీనివాస కాలనీలో సుమారు రూ.60 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ స్థలాల ప్రహరీని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రమేష్, పార్టీ నాయకులు ఎ.రాజేష్, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం

పేదలకు మెరుగైన, నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. నగరంలోని కొత్తపేట ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆర్కే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవితో కలసి పరిశీలించి ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్‌కుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి అధికారం తథ్యం

పేదవాడి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి రావడం తథ్యమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు కట్టెపోగు బసవరావు ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన పాదయాత్ర బుధవారం మంగళగిరి చేరుకుంది. చినకాకాని నేతన్న సర్కిల్ వద్ద నుంచి మంగళగిరి కొత్తబస్టాండ్ సెంటర్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద వరకు జరిగిన పాదయాత్రలో నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్కే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, నాయకులు ఆకురాతి రాజేష్, ఈపూరి ఆదాం, బేతపూడి నర్సయ్య, కట్టెపోగు ఉదయ్ భాస్కర్, మల్లవరపు సుధారాణి, సంకె సునీత పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే, గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల తదితరులు

నిడమర్రులో..

మంగళగిరి-తాడేపల్లి కార్పోరేషన్ పరిధిలోని నిడమర్రులో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి ప్రారంభించారు. తొలుత వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించి బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం నూతనంగా నిర్మించిన బీటీ, సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లను గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల ప్రారంభించారు.

సిద్ధం సభ విజయవంతానికి సమష్టిగా కృషి

ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, సమన్వయకర్త మేకతోటి సుచరిత

తాడికొండ: సిద్ధం సభ విజయవంతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. గుంటూరు బ్రాడిపేటలోని తన కార్యాలయంలో సిద్ధం పోస్టర్ ఆవిష్కరణ సభ బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సిద్ధం సభలను చూసి ప్రతిపక్షం తట్టుకోలేని పరిస్థితి ఉందంటే ప్రజల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఉన్న ఆదరణ అలాంటిది అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకే జగనన్నను రాష్ట్ర ప్రజలు 151 సీట్లలో ప్రజలు గెలిపించారని, అలాంటిది నేడు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన జగనన్న మళ్లీ ఎన్నికలకు వెళితే 151 సీట్లలో గెలిపిస్తే అది సాధారణమే అవుతుంది, కనుక జగనన్నకు 175 సీట్లు ఇచ్చేందు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. 18 సంవత్సరాల తన రాజకీయ జీవితంలో ఐదు ఎన్నికల్లో పోటీ చేశానని, తనకు జరగబోయేది 6వ ఎన్నిక కావున గెలుపు అనేది తనకు సాధారణమే కానీ రాజధాని ప్రాంతంలో కొత్త ఒరవడికి నాంది పలికేలా భారీ మెజార్టీని సంపాదించి జగనన్నకు బహుమతిగా ఇవ్వాలన్నారు. దిగంవత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో రాజకీయాల్లోకి వచ్చిన తాను ఆయన మరణానంతరం కూడా పదవికి రాజీనామా చేసి జగనన్న వెంట నడిచిన విషయాన్ని గుర్తు చేశారు. మన నాయకుడు ఏం చెప్పాడు అదే చేస్తాడు అనే నినాదం ప్రజల్లోకి తీసుకెళ్తే చాలు కనుక వైఎస్సార్ సీపీని విజయం దిశగా చేరువ చేయాలంటే ప్రజలకు జరిగిన లబ్ధిని వివరించి ఓటు అడిగితే చాలన్నారు. ఒక్కో ఇంటికి వెళ్ళి సంక్షేమ పథకాలు అందాయా అని అడుగుతుంటే ఒక కుటుంబంలో 3-4 సంక్షేమ పథకాలు అందాయని చెప్పే పరిస్థితి ఉందంటే జగనన్నకు 175 సీట్లలో గెలిపించి ఇవ్వడం అందరూ కర్తవ్యంగా తీసుకోవాలన్నారు. మార్చి 10న మేదరమెట్లలో జరిగే సిద్ధం సభను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు భారీగా పాల్గొనాలని కోరారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి

ఎస్పీ తుషార్ డూడీ



దుగ్గిరాల స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

మంగళగిరి/తాడేపల్లిరూరల్: నియోజకవర్గంలోని మంగళగిరి, దుగ్గిరాల పోలీస్‌స్టేషన్లను ఎస్పీ తుషార్ డూడీ బుధవారం తనిఖీ చేశారు. కేసుల వివరాలు, నేర నియంత్రణ చర్యలు, శాంతి భద్రతల పరిరక్షణ, ఎలక్షన్ సంబంధిత వివరాలను మంగళగిరి టౌన్ సీఐ శ్రీనివాసరావు, రూరల్ సీఐ వెంకటరావును అడిగి తెలుసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు. నేర నియంత్రణ, అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాల కట్టడికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. రానున్న ఎన్నికల దృష్ట్యా జిల్లాలోని అందరు పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, గడిచిన ఎన్నికల అనుభవాలను, జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను బలోపేతం చేసి ముందస్తు ప్రణాళికలు, చర్యలు తీసుకోవాలని కోరారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, ట్రబుల్ మాంగర్స్‌పై ప్రత్యేక నిఘా కొనసాగించాలని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట మంగళగిరి టౌన్ సీఐ శ్రీనివాసరావు, రూరల్ సీఐ వెంకటరావు, దుగ్గిరాల ఎస్ఐ ప్రతాప్, స్పెషల్ బ్రాంచ్ సీఐ వెంకటరావు ఉన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి

తాడేపల్లిరూరల్: ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి సూచించారు. సర్ సీవీ రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణ దినం, వేదిక ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రామన్ ఒక వినూత్న విజ్ఞాన శాస్త్ర ప్రయోగ ఫలితాన్ని ప్రపంచానికి అందించిన రోజును భారతదేశంలో సైన్స్ దినోత్సవంగా ఫిబ్రవరి 28న జరుపుకుంటున్నామని అన్నారు. జేవీవీ 35 సంవత్సరాలు అయిన సందర్భంగా ప్రతి సంవత్సరం చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహణ, విద్యార్థులకు చెకుముకి మాసపత్రికలను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కంచర్ల రాజ్యం, దుర్గారావు, సిహెచ్ వెంకన్న, దేవదానం, కె.వి.నారాయణ పాల్గొన్నారు.

వేమవరం పాఠశాలలో సైన్స్ దినోత్సవం

ఫిరంగిపురం: మానవాళి అభివృద్ధికి సైన్సు ఎంతో దోహదం చేస్తుందని పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రామిరెడ్డి అన్నారు. మండలంలోని వేమవరం ఎంపీపీ పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవం బుధవారం నిర్వహించారు వివిధ శాస్త్రవేత్తల చిత్రాలతో ప్రదర్శన నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం దీవి కమల్‌మోహన్, పంచాయతీ కార్యదర్శి భారతి, క్లస్టర్ రిసోర్సు పర్సన్ సుశీల, రవిశేష కుమార్, ప్రభాకర్, యశోద, వెళాంగిణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు వినియోగిస్తే కఠిన చర్యలు



నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ జి.శేఖర్‌బాబు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం రాధారంగా నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ల మూడి శేఖర్‌బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాల వలన విద్యార్థుల జీవితాలు నాశనం అవుతున్నాని, సరదాగా అలవాటు చేసుకుని చివరకు మత్తు పదార్థాలు లేకుండా ఉండలేని పరిస్థితికి వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి కుటుంబ సభ్యులను, యువతను జాగ్రత్తగా గమనించాలని, ఎవరైనా మాదక ద్రవ్యాలకు బానిసలైన వారిని ముందుగా గుర్తించి, అవగాహన కల్పించి, కౌన్సిలింగ్ మరియు డి అడిక్షన్ సెంటర్‌కు పంపించాలని కోరారు. చిన్న పిల్లల్లో ఎక్కువగా మానసిక సమస్యలు వస్తున్నాయని, వయసు పెరుగుతున్నా మాటలు రావడం లేదని, దీనికి సెల్‌ఫోన్‌కి బానిసలు కావడం ఒక కారణమని అన్నారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ బి.రమేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చింతపల్లి శిరోమణి పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని మహానాడు, శ్రీ సాయి సతీష్ ఫౌండేషన్ టైలరింగ్ శిక్షణ కేంద్రంలో ప్రపంచ టైలర్స్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కుట్టు మిషన్ రూపకర్త విలియమ్ హూవే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహానాడును టైలరింగ్ హబ్‌గా చేయాలని ఆకాంక్షిస్తున్నామని చెప్పారు. టైలర్స్ కార్పొరేషన్ చైర్మన్ సుభాని మాట్లాడుతూ టైలరింగ్ వృత్తిపై ఆధారపడి వారందరూ విలియమ్స్ హూవేకు రుణపడి ఉంటారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టైలర్స్ గౌరవ అధ్యక్షులు శేఖర్, నూర్ బాషా, శ్రీను, బాషా, టైలర్స్ యూనియన్ నాయకులు కృష్ణ, ఇనిస్టిట్యూట్ టీచర్ భవాని పాల్గొన్నారు.

కార్పొరేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు అవకాశం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తాడేపల్లి ఎంఈఓలు శాంతకుమారి, నాగేశ్వరరావు

తాడేపల్లిరూరల్: పేద విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశం కోసం ప్రభుత్వం ప్రకటన విడుదల చేసినట్లు తాడేపల్లి ఎంఈఓలు శాంతకుమారి, నాగేశ్వరరావు తెలిపారు. ఎంటీఎంసీ పరిధిలోని స్థానిక ఎంఈఓ కార్యాలయంలో పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని ప్రైవేటు పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం ఒకటో తరగతిలో 25 ఉచిత ప్రవేశాల కోసం ప్రభుత్వం ప్రకటన విడుదల చేసిందని, దీని ప్రకారం 24-02-2024 నుంచి 14-03-2024 వరకు అర్హులైన పిల్లల తల్లిదండ్రులు ఛిట్ప్స్ ఇజౌ రి.జీ ు అనేవెబ్‌సైట్‌లో సంబంధిత పత్రాలను జత పరచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనాథ పిల్లలకు, హెచ్ఐవీ బాధితులకు 5శాతం, షెడ్యూల్ కులాలు 10, షెడ్యూల్ తెగలు 4, బలహీనవర్గాలు (బీసీ, మైనార్టీ, ఇతరులు) 6 శాతం రిజర్వేషన్ ఉంటుందని, దరఖాస్తు చేసుకోవడానికి గ్రామ సచివాలయం, నెట్ సెంటర్, ఎంఈఓ. కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయం ఏడాదికి లక్షా ఇరవై వేలు రూపాయలు, పట్టణ ప్రాంతంలో లక్ష నలభై నాలుగు వేల రూపాయలలోపు ఉండాలని, 1వ తరగతి ప్రవేశానికి అర్హులైన పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సందేహాల నివృత్తి కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 14417ను సంప్రదించవచ్చని వారు పేర్కొన్నారు.

సైన్స్ విజ్ఞాన ప్రదర్శన



ఎగ్జిబిట్‌లను పరిశీలిస్తున్న టీచర్లు

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని ఆత్మకూరులోని నిర్మల ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జాతీయ సైన్స్ డేను పురస్కరించుకుని బుధవారం ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరస్పాండెంట్ రెవ. సిస్టర్ జి.జాన్ పాల్ హాజరయ్యారు. డాక్టర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాన్‌పాల్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో సైన్స్ పాత్ర చాలా కీలకమని, ఏ దేశమైనా సైన్స్ రంగంలో అభివృద్ధి చెందితే ఆ దేశం ప్రగతిపథంలో దూసుకుపోతుందని అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచి సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు జ్ఞాన సుందరి మాట్లాడుతూ నిత్యజీవితంలో నేడు సైన్స్ ఒక భాగం అయిందని, విద్యార్థులు భావి భారత శాస్త్రవేత్తలుగా రాణించాలని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల శాస్త్రవేత్తల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకి లభ్యం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ దశరథరామారావు

తెనాలిరూరల్: మనస్తాపంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన వ్యక్తి ఆచూకిని పోలీసులు గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించారు. వన్‌టౌన్ సీఐ దశరథ రామారావు కథనం.. వట్టిచెరుకూరు మండలం కుర్నూతల గ్రామానికి చెందిన 31 ఏళ్ల గోపయ్య తెనాలి నాజరుపేటలోని అమ్మమ్మ ఇంటి వద్ద రెండేళ్లగా ఉంటున్నాడు. తాపీ పనులకు వెళ్లే అతని భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి కాపురానికి రావడం లేదు. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 23వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించగా వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సెల్‌ఫోన్ టవర్ లొకేషన్, కాల్ డీటైల్స్‌సేకరించి గోపయ్య విజయవాడ దుర్గమ్మ గుడిలో ఉంటున్నట్లు గుర్తించారు. విజయవాడ వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకుని తెనాలి తీసుకువచ్చి అతడి తల్లి దుర్గకు బుధవారం అప్పగించారు.

రోడ్డు పరిస్థితిపై వాట్సప్ మెసేజ్

- స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే
- గంటల వ్యవధిలో రోడ్డు నిర్మాణానికి సొంత నిధులు
- శంకుస్థాపన చేసిన దుగ్గిరాల ఎంపీపీ, జెడ్పీటీసీ



రోడ్డు నిర్మాణానికి సాయం అందజేస్తున్న ఎంపీపీ సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ

తాడేపల్లిరూరల్: ప్రజాసమస్యలపై దృష్టి సారించి ఫోన్‌ల ద్వారా, వాట్సప్ మెసేజ్‌ల ద్వారా సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆ సమస్యల పరిష్కారానికి తన సొంత నిధులతో నిర్మాణ పనులు చేపడుతున్నారు. తాజాగా దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెంలో బీసీ కాలనీలో రోడ్డు పరిస్థితిపై స్థానికులు ఎమ్మెల్యే ఆర్కేకు వాట్సప్ మెసేజ్ ద్వారా సమాచారం అందించారు. స్పందించిన ఆయన మండల అభివృద్ధి అధికారులతో రహదారి నిర్మాణానికి అయ్యే ఖర్చును అంచనా వేయించారు. వాట్సప్ మెసేజ్ పెట్టిన 12 గంటల్లో ఎమ్మెల్యే ఆర్కే రోడ్డు నిర్మాణానికి అవసరమైన లక్ష 50 వేల రూపాయల నిధులను దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ బీసీ కాలనీ వాసులకు అందజేసి రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఎస్.రత్నం, బీసీ సెల్ అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, నాయకులు చిలకా తిమోతి, యాల్లమ్మటి ప్రసాద్, బుల్లా శ్రీనివాసరావు, బుల్లా జకరయ్య పాల్గొన్నారు.

చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు

డాక్టర్ ఖాదర్ వలి



డాక్టర్ ఖాదర్ వలిని సత్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తాడికొండ: అనారోగ్యాలు దరిచేరకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో చిరుధాన్యాల ఆహార వినియోగం అలవాటు చేసుకోవాలని మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఖాదర్ వలి అన్నారు. ఐనవోలు వీఐటీ ఏపీ వర్సిటీలో స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ అండ్ ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, ఎంట్రప్రెన్యూర్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఖాదర్ వలి మాట్లాడుతూ సరైన ఆహారం తీసుకుంటే మందులు అవసరం లేదని, దేహానికి అవసరమైన పోషకాలు అధికంగా ఉండే చిరుధాన్యాలు తినడం వలన అనారోగ్యాలను నివారించడంతో పాటు మందులపై ఆధారపడటాన్ని తగ్గి ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. చిరుధాన్యాల ఆహారంలో ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు వంటి అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయని చెప్పారు. రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హానికరమైన పురుగు మందులు లేని సేంద్రీయ వ్యవసాయ పద్ధతులతో పండించిన ఆహార ఉత్పత్తులను ఉపయోగించాలని కోరారు. తెగుళ్ల నివారణ, భూసారం, పంటల నిర్వహణకు సహజ పద్ధతులను అవలంబించే సమగ్ర సేంద్రీయ వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించడంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వీఐటీ ఏపీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈఓ సేతు మాధవన్, ఎంఆర్‌డీసీ సీనియర్ జనరల్ మేనేజర్ డాక్టర్ బిజయ్ కుమార్ సాహూ, ఏఐ మొబిలిటీ ఫౌండర్ డాక్టర్ వెంకట రమణ, గౌతమీ పంప్స్ అండ్ వాల్వ్స్ ఎండీ హరి ప్రసాద్, జెస్పీడ్ క్రయో ఎండీ వినోద్ కుమార్, ఐకాన్ ఫార్మాస్యూటికల్ ల్యాబరేటరీస్ జి.నరేంద్ర, త్రివేణి ఫార్మలేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫ్ క్యూ క్యూఐ అండ్ క్యూసి అఖిల్ పేర్ల, ఇన్స్ట్రుమెంట్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రోగ్రాం మేనేజర్ హనుకుమార్, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, డీన్ స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రొఫెసర్ శ్రీనివాస్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.వెంకట రజనీకాంత్, కన్వీనర్ సైన్స్‌డే డాక్టర్ కె సెంథిల్, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, ఎంటర్ ప్రెన్యూర్ సెల్ డైరెక్టర్ డాక్టర్ అమిత్ చవాన్ పాల్గొన్నారు.

తుళ్లూరులో యువకుడు మృతదేహం లభ్యం

తాడికొండ: తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని యువకుడు మృతదేహం లభించిందని సీఐ సుభాని తెలిపారు. వివరాలు.. తుళ్లూరు సీడ్ యాక్సిస్ రోడ్డు ఎండ్ పాయింట్ టీటీడీ కళ్యాణ మండపం దగ్గర గుర్తుతెలియని యువకుడు మృతదేహం ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించినట్లు చెప్పారు. మృతదేహంపై గొంతు కుడివైపు పుట్టుమచ్చ, ఎడమ రొమ్ముపైన పుట్టుమచ్చ ఉన్నట్లు గుర్తించామని, ఎత్తు 5.10, చామనచాయ రంగులో బట్టతల ఉందని తెలిపారు. మృతుడు గత కొన్ని రోజులుగా పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు సమాచారం కాగా మృతికి సంబంధించిన ఎలాంటి ఆనవాళ్ళు లభించలేదని, గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తన ఫోన్ 9440900860, ఎస్ఐ వేణుగోపాల్ ఫోన్ నంబర్ 967659642లకు సమాచారం అందించాలని కోరారు.

మద్యం విక్రేతల అరెస్ట్

మంగళగిరి: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసి వీరి వద్ద నుంచి 140 మద్యం సీసాలతో పాటు ఓ ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు సెబ్ డీఎస్ఈఓ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి నవులూరు సెబ్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎల్.రంగారెడ్డి, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో మంగళగిరి సెబ్ కార్యాలయ పరిధిలోని తాడికొండ మండలం పొన్నెకల్లు వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో సీఐ పి.ప్రసన్నలక్ష్మి బృందం మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

అదే సమయంలో ఓ ద్విచక్ర వాహనంపై వెళుతున్న తాడికొండకు చెందిన యనమల కిషోర్, కనపర్తి నిఖిల్, మేడికొండూరు మండలం విశదలకు చెందిన చిలక రామకోటయ్యలను తనిఖీ చేసి వీరి వద్ద నుంచి 140 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.